క్లుప్తంగా

నేడు పెద్దింట్లమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేకాలంకరణలోని ఉప్పుగూడెం పెద్దింట్లమ్మవారు

దెందులూరు: సోమవరప్పాడు పంచాయతీ ఉప్పుగూడెంలోని పెద్దింట్లమ్మ తల్లి 15వ ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయం అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకాలంకరణ చేసి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఏర్పాట్లు ఘనంగా పూర్తి చేశామన్నారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేకాలంకరణ అనంతరం పూజలు, మహాన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గంగానమ్మ తల్లికి విశేష పూజలు



దెందులూరు గౌడవీధిలోని గంగానమ్మ తల్లి

దెందులూరు: దెందులూరు గౌడవీధిలో గంగానమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి విశిష్ట అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అనేక గ్రామాల నుంచి వచ్చే భక్తులకు రెండవ రోజు ఆదివారం మహాన్నదానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గంగానమ్మ తల్లి ఆలయ ఆవరణలో నిర్వహించనున్నట్టు కొండ్రు సత్యనారాయణ తెలిపారు.

నేడు బ్రహ్మశ్రీ చాగంటి ప్రవచనం

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హనుమాన్ జంక్షన్ పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రామచంద్రరావుకు ఘన నివాళి



నారాయణపురంలో రామచంద్రరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం మాజీ సర్పంచ్ గుణం రామచంద్రరావు వర్ధంతి శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామచంద్రరావు ఫ్రెండ్స్ సర్కిల్ బొమ్మిడి అప్పారావు, సాగిరాజు జానికిరామ రాజు, అడపశ్రీను, గుణ్ణం బుల్లియ్యా, గంగాధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆయుర్వేద వైద్య విధానంలో అందుబాటులో ఉన్న మంచి చికిత్స, నాణ్యమైన మందుల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకోవచ్చని ఆయుర్వేద వైద్యుడు బీవీఎం నగేష్ అన్నారు. స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఏలూరు లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆయా వ్యాధుల నివారణకు డాక్టర్ నగేష్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శిబిరంలో బొలిశెట్టి సురేష్, చెన్నా వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

థైరాయిడ్ టెస్టింగ్ మెషీన్‌ను వినియోగంలోకి తేవాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న థైరాయిడ్ మెషీన్‌ను వినియోగంలోకి తేవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీ ఆసుపత్రిగా మార్పు చేసిందని, రోగుల సౌకర్యార్థం దాదాపు రూ.20 లక్షల విలువైన థైరాయిడ్ టెస్టింగ్ మెషీన్‌ను కొనుగోలు చేసి పంపించిందని తెలిపారు. గతేడాది నుంచి ఈ థైరాయిడ్ మెషీన్ మూలన పడి, రోగుల పరీక్షలకు వినియోగించడం లేదని పేర్కొన్నారు. థైరాయిడ్ టెస్టుల కోసం సిబ్బందిని నియమించకపోవడం, ఉన్నవారికి ట్రెనింగ్ ఇవ్వకపోవడం వల్ల విలువైన థైరాయిడ్ టెస్టింగ్ మెషీన్ నిరుపయోగంగా మారిందన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి నిత్యం వచ్చే 10 మంది వరకు రోగులు థైరాయిడ్ పరీక్షలు బయట చేయించుకోవాల్సి వస్తోందని తెలిపారు.

నాణ్యత లేని ఆహారం.. తింటే అనారోగ్యం

- నోరూరించేలా రంగులు, వివిధ మసాలాల వినియోగం
- హానికర పదార్థాలు, అపరిశుభ్రతతో రోగాలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు



పానీ పూరీ స్టాల్

పెదవేగి : రోడ్ల పక్కన విక్రయించే చిరుతిళ్లు చూస్తుంటే నోరూరుతుంది. వాటిని తినాలని మనసు పీకుతుంది. జిహ్వా చాపల్యానికి లోనై వాటిని తింటే అనారోగ్యం బారిన పడక తప్పదు. దెందులూరు నియోజకవర్గంలో ప్రధాన గ్రామాల్లో వీధి పక్కన విక్రయించే చిరుతిళ్ల వ్యాపారం మూడు ప్లేట్లు ఆరు పార్శిళ్లుగా జోరుగా సాగుతోంది. గతంలో పట్టణాల్లో మాత్రమే కనిపించే ఈ వ్యాపారాలు ఇప్పుడు పల్లెల్లోనూ విస్తరించాయి. కంటికి ఇంపుగా రంగులో, మసాలా ఘుమఘుమలతో కూడిన ఆహారం ఆకట్టుకుంటుంది. నూడిల్స్, మంచూరియా, పానీపూరీ, చాట్ మసాలాలు అబ్బో అనిపిస్తుంటాయి. వాటిని చూస్తుంటే తినాలనిపిస్తుంటుంది. వాటి తయారీలో ఎటువంటి నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. వాటిని తరచుగా తింటే అనారోగ్యం పాలుకాక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ తరహా అపరిశుభ్రమైన ఆహారాన్ని తింటే అమీబియాసిస్, మలబద్ధకం తదితర సమస్యలు తలెత్తుతాయి. అంతేకాక వీటిని ఎక్కువగా తినేవారు ఊబకాయులుగానో, లేకుంటే బక్కచిక్కడమో జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఆకర్షితులవుతున్న యువత

బజారులో ఆహార పదార్థాల వ్యాపారులు ఎక్కువగా కళాశాలలు, వసతి గృహాలు, విద్యాసంస్థలు, జనం ఎక్కువగా సంచరించే జంక్షన్లలో వ్యాపారాలు చేస్తున్నారు. పట్టణంలో ఫుట్‌పాత్‌లపై, కళాశాలల ఎదురుగా ఉన్న ఈ బళ్ల వద్ద 90 శాతం పైగా విద్యార్థులే కనిపిస్తుంటారు.

పరిశుభ్రత నాస్తి

విద్యార్థులు, యువత ఎక్కువగా ఇష్టపడే వీధి వంటకం పానీపూరీ చాట్, నీటితో నింపి ఇచ్చే క్రమంలో బ్యాక్టీరియా, ఫంగస్‌ను మన శరీరంలోకి ప్రవేశించే ప్రమాదం ఉంది. పానీపూరీలో చాట్ నింపిన అనంతరం పూరీలను ప్రత్యేకంగా తయారయ్యే నీటితో ఉంచి వినియోగదారునికి అందిస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారులు కనీస పరిశుభ్రత చర్యలు పాటించరు. వ్యాపారం జరిగే నాలుగైదు గంటల సమయం సదా వ్యాపారి చేతులు నీళ్లలో నానుతూనే ఉంటాయి. వేళ్ల సందుల్లో గోళ్ల మధ్య ప్రమాదకర క్యాండీడా ఫంగస్ చేరుతుంది. మురిగిపోయిన చాట్‌ను మరుసటి రోజు వినియోగిస్తుంటారు. చాట్‌లో బ్యాక్టీరియా, వైరస్ వృద్ధి చెందే ప్రమాదం ఉంది.

పరిశుభ్రమైన ప్రదేశాల్లోనే తినాలి



బయట ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాల్సి వస్తే వీలైనంత వరకు పరిశుభ్రమైన ప్రదేశాల్లో శుచికరమైన పదార్థాలనే తీసుకోవాలి. పానీపూరీ, చాట్ వంటివి తినాలనుకుంటే చాట్, పూరీ నీటిని విడివిడిగా అందించే కేంద్రాన్ని ఎంచుకుంటే ఫంగస్ బారినపడే ప్రమాదం తప్పుతుంది. బయట ఆహారం తీసుకునేటప్పుడు త్వరగా భూమిలో కలసిపోయే సహజ సిద్ధ వనరులతో తయారైన డిస్పోజబుల్ పాత్రల్లోనే తీసుకోవాలి.

– మాధవి, వైద్యాధికారి, పెదవేగి

65 మందికి వైద్య సేవలు



గుండుగొలనులో రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు

భీమడోలు: మండలంలో గుండుగొలనులో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. సీహెచ్ పోతేపల్లికి చెందిన సాయి జనరల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రామకృష్ణ నేతృత్వంలోని వైద్యులు 65 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ అందజేశారు. ఈ శిబిరాన్ని శ్రీసత్యసాయి సేవా సమితి మెడికల్ జిల్లా కోఆర్డినేటర్ కోడూరి నరసింహమూర్తి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు సత్యసాయి సేవా సంస్థ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడూరి శివరామకృష్ణ, గుండుగొలను కన్వీనర్ జీవీ సుబ్బారావు, యూత్ కోఆర్డినేటర్ కాబోతుల సోమేశ్వరరావు, సభ్యులు గెడ్డం రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం



పిప్పర గ్రంథాలయంలో ధ్రువపత్రాలతో విద్యార్థులు

గణపవరం: వేసవి విజ్ఞానం పేరిట విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని గుడ్ల కృష్ణారావు, ప్రముఖ చిత్రకారుడు బత్తుల రాజు అన్నారు. గణపవరం మండలం పిప్పర శాఖా గ్రంథాలయంలో నెల రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వేసవి సెలవులు సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు వివిధ అంశాలలో నైపుణ్యత సాధించేలా శిక్షణ ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. శిబిరంలో నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రాలు వేసవి శిబిరాలు

భీమడోలు: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 21 రోజుల పాటు జరిగిన శిక్షణాంశాలల్లో ఉత్తమ ప్రతిభను చూపిన 45 మంది విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా వినియోగదారుల హక్కుల కమీషన్ జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంఠ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారథి, ఏలూరు జిల్లా ఇంచార్జి పోలిశెట్టి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొని గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు. వేసవిలో చిన్నారులంతా సమయాన్ని వృథా చేయకుండా ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఒక వ్యక్తి మేధావిగాను, ప్రపంచజ్ఞానిగా ఎదగడానికి గ్రంథాలయాల పాత్ర అమోఘమన్నారు. విద్య, విజ్ఞానం, వినోదంతో పాటు సామాజిక అంశాలపై పట్టు సాధించేందుకు ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేటి విద్యార్థులకు నిజమైన నేస్తాలు పుస్తకాలే కావాలన్నారు. అనంతరం నీతి కథలు, పుస్తక సమీక్షలు, గణితం, చదరంగం, క్విజ్, చిత్రలేఖనం వంటి పోటీల్లో విజేతలైన 45 మందికి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశీలక కమిటీ సభ్యులు ఉప్పు గంగాధరావు, బి.తులసీరామ్, పెద్దలు చలమయ్య, డి.చంద్రకళ, పంట్ల కృష్ణవేణి విద్యార్థులు పాల్గొన్నారు.



భీమడోలు లైబ్రరీలో సర్టిఫికెట్లతో విద్యార్థులు



విద్యార్థిని అభినందిస్తున్న ప్రముఖులు

మలేరియాపై అప్రమత్తత అవసరం



కాగుపాడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: చలి, వణుకుతో కూడిన జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు సూచించారు. జాతీయ మలేరియా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమ కాటు నుంచి రక్షణ కోసం స్లీవ్ దుస్తులు ధరించాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అవసరం మేరకు ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డా.మానస, డా.సాయి అనూషలు మాట్లాడుతూ చలి, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కమత వరపు శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు కె.సత్యనారాయణ, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు విజయ, ఆరోగ్య సహాయకులు డి.ఏసెబు, పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని వార్డుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి



సరిపల్లె సీపీఎఫ్ కంపెనీ వద్ద రాస్తారోకో చేస్తున్న ఉద్యోగులు

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీని కంపెనీ యాజమాన్యం అన్యాయంగా మూసివేసి ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందని, కంపెనీలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ఉద్యోగులు శనివారం ఆందోళన చేపట్టారు. కంపెనీ గేటు వద్ద వారంతా నిరసన దీక్ష చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలతో హోరెత్తించారు. తమను ఉద్యోగాలలోకి తీసుకున్న సమయంలో ఉద్యోగభద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని యాజమాన్యం విస్మరించి ఉద్యోగులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. థాయిలాండ్‌కు చెందిన సీపీఎఫ్ రొయ్యలు, చేపలమేతల తయారీ కంపెనీకి దేశంలో అనేక చోట్ల యూనిట్లు ఉన్నాయని, వీటిలో సరిపల్లె యూనిట్ లాభాల్లో ఉన్నా అన్యాయంగా మూసి వేశారని ఉద్యోగులు వాపోయారు. యాజమాన్యం తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. గణపవరం భీమవరం ప్రధాన రోడ్డుపై ఆందోళన నిర్వహించారు.

గొంతు వాపు.. గేదెల ఆరోగ్యానికి ప్రమాదకారి



అంబులెన్స్‌లో పాడి పశువుకు వైద్యం చేస్తున్న దృశ్యం

దెందులూరు: తొలకరి జల్లులు కురువడం ప్రారంభమవడంతో గేదెల్లో పలు వ్యాధులు బయటపడే అవకాశం ఉంది. వీటిల్లో ప్రధానంగా గొంతువాపు వ్యాధి ముఖ్యమైంది. వేసవి కాలం ముగిసి వర్షాకాలం ప్రారంభమైన వెంటనే గేదెలకు మొదట వచ్చే వ్యాధి గొంతు వాపు. రైతులు జాగ్రత్తగా ఉండకపోతే పశువుల్లో ఈ వ్యాధి ముదిరి అనేక రకాల నష్టాలు జరిగే ప్రమాదం ఉంది. గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ వైద్యశాలలతో పాటు గేదెలు కదలలేని పరిస్థితి, వైద్యశాలకు రాలేని పరిస్థితుల్లో సైతం సకాలంలో వైద్యశాలలకు మనుషులు మాదిరిగా వైద్య సేవలందించేందుకు గత ప్రభుత్వం అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి వైద్యచికిత్సలు పశువుల ముంగిటకే అందిస్తోంది.

గేదెల్లో గొంతువాపు వ్యాధి లక్షణాలు

సొంగ కారడం, జ్వరం రావడం, శ్వాసలో ఇబ్బంది, మేత మేయకపోవడం, పాల దిగుబడి తగ్గడం వంటివి కనిపిస్తాయి.

వైద్యసేవలు

గేదెల్లో గొంతు వాపు వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే హెచ్ఎస్ వ్యాక్సిన్ టీకాలను వేయించాలి. పశు వైద్యశాలల్లో సిబ్బంది అంబులెన్స్‌లో సిబ్బంది ఈ వ్యాక్సిన్లు గేదెలకు వేస్తారు.

పశువైద్య సేవలకు 1963 అంబులెన్స్

మనుషులు మాదిరిగానే సకాలంలో పశువైద్య సేవలందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టోల్ ఫ్రీ నంబర్ 1963 ఏర్పాటు చేశారు. ఈ నంబర్‌కు ఫోన్ చేసిన వెంటనే రైతు ఇంటికే అంబులెన్స్ వచ్చి బాధిత పశువులకు వైద్యసిబ్బంది సేవలు, చికిత్స చేస్తారు.

నియోజకవర్గం వారీగా వివరాలు	
మండలం	గేదెల సంఖ్య
దెందులూరు	11 వేలు
ఏలూరు రూరల్	6 వేలు
పెదవేగి	15 వేలు
పెదపాడు	12 వేలు

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులంతా ఈ సీజన్ ప్రారంభకాలంలో ప్రతి రోజూ గేదెను పరిక్షించాలి. అనారోగ్య లక్షణాలను గుర్తించాలి. లక్షణాలు గుర్తించిన వెంటనే గేదె నడవగలిగితే వైద్యశాలకు తీసుకురావాలి. నడవలేని పక్షంలో పశువైద్యసేవలకు నియమించిన అంబులెన్స్ ట్రోల్ ఫ్రీ నంబర్ 1963కు సంప్రదించి పశువైద్య సేవలను తీసుకోవాలి.

– రామ్మోహనరావు, మండల పశువైద్యాధికారి, దెందులూరు

విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి కిషోర్

ఏలూరు (టూటౌన్): ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని సీపీఎం ఏలూరు నగరకార్యదర్శి పి.కిషోర్ కోరారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సీపీఎం నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు నగరంలో ఉన్న ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. ఏటా ఇష్టానుసారంగా స్కూలు, కాలేజీల ఫీజులు పెంచుకుంటూ పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, జీఓ 53, 54 ప్రకారం ప్రైవేటు స్కూలు, కాలేజీలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు రూ.10 వేలు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు రూ.15 వేలు, కాలేజీల్లో సైన్స్, ఆర్ట్స్ గ్రూపును బట్టి రూ.15 వేలు నుంచి రూ.17,500 వరకు మాత్రమే ఫీజులు వసూలు చేయాలని తెలిపారు. కానీ ప్రైవేటు విద్యాసంస్థలు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు రూ.15 వేలు నుంచి రూ.40 వేలు వరకు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు రూ.30 వేలు నుంచి రూ.65 వేల వరకు, కాలేజీల్లో రూ.70 వేలు నుంచి రూ.లక్ష వరకు ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని వివరించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎక్కడా ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడం లేదని విమర్శించారు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలని, అది ఎక్కడా అమలు చేయడం లేదని అన్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వ నిబంధనలు అమలు చేసేందుకు ఒక కమిటీ వేయాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యాశాఖ అధికారులు ప్రైవేటు విద్యాసంస్థల్లో తనిఖీలు చేసి తక్షణమే ప్రభుత్వ నిబంధనలు అమలు చేయని ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు కె.రామాంజనేయులు, బి.జగన్నాథరావు, వి.సాయిబాబు, వీవీఎస్ ప్రసాద్, జి.రవికిషోర్, వైఎస్ కనకారావు, ఎం.అరుణ కుమారి, హైమ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి రైతు కూలీ సంఘం మహాసభలు



మహాసభల పోస్టర్ విడుల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): స్థానిక టుబాకో మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో రైతుకూలీ సంఘం (ఆంధ్ర ప్రదేశ్) రాష్ట్ర మహాసభలు ఈ నెల 15,16,17 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ తెలిపారు. స్థానిక వసంతమహల్ సెంటర్‌లోని జాబిల్లి కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. జూన్ 15న ఉదయం 11 గంటలకు ప్రారంభ సభ, సాయంత్రం ఏలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. 16వ తేదీన వ్యవసాయ రంగ సంక్షోభం – పాలకుల విధానం – మన కర్తవ్యాలుపై సదస్సు నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ శాఖ మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రారంభోపన్యాసం చేస్తారని, గ్రామీణ యువత నిరుద్యోగం వలసలు అనే అంశంపై ఐపీఎస్ మాజీ అధికారి, రిటైర్డ్ జేడీ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. అటవీ హక్కులు పునరావాసం అనే అంశంపై రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్ ఝాన్సీ, భూమి సమస్య సామాజిక న్యాయం అనే అంశంపై దళిత బహుజన మహాసభ నాయకులు వై.కోటేశ్వరరావు మాట్లాడతారని చెప్పారు. పంజాబ్, ఢిల్లీ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలకు నుంచి ప్రతినిధుల సందేశాలు, రైతు – వ్యవసాయ కూలీ సంఘాల నాయకులు సౌహార్ద సందేశాలు ఉంటాయని తెలిపారు. 17వ తేదీన గత కార్యకలాపాల నివేదిక, నూతన కమిటీ ఎన్నిక ఉంటాయన్నారు. ఈ మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మహాసభల వాల్ పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ, కోశాధికారి పి.లలిత కుమారి, జిల్లా కార్యదర్శి ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

త్రిభాషా నిఘంటువుల పంపిణీ



నిఘంటువులతో విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్ పేటలోని హిందీ నికేతన్ వజ్రోత్సవాల సందర్భంగా హిందీ భాషా కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఎస్ఆర్ పబ్లికేషన్స్ సౌజన్యంతో మాతృదేవోభవ ట్రస్ట్ నేతృత్వంలో తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల నిఘంటువులను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు వి.వెంకటస్వామి మాట్లాడుతూ పద జ్ఞానం భాషకు సంబంధించిన నిధి అని, ఆ నిధిని సాధించాలంటే ప్రతి విద్యార్థి నిఘంటువును అధ్యయనం చేసి పదజ్ఞానం పెంచుకోవాని, తద్వారా వాక్య జ్ఞానాన్ని, భాషా జ్ఞానాన్ని పొందవచ్చునని సూచించారు. మాతృదేవోభవ సంస్థ కార్యదర్శి కూచిపూడి సత్యనారాయణ మాట్లాడుతూ తమ సంస్థ విద్యార్థులకు చేసే సేవలు గుర్తించి తమ వంతు బాధ్యతగా ఎస్ఆర్ పబ్లికేషన్స్ వారు విద్యార్థులకు ఉపయోగపడే వివిధ రకాల పుస్తకాలను పంపిణీ చేసే బాధ్యతను తమకు అప్పగించటం ఒక బృహత్తర కార్యక్రమమని చెప్పారు. మాతృదేవోభవ సంస్థ కోశాధికారి పూడి భాస్కరరామం మాట్లాడుతూ విద్యార్థులు నిఘంటువు ఉపయోగించుకుని భాషా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాతృదేవోభవ సంస్థ సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాతృదేవోభవ సంస్థ సభ్యులు వి.హరినారాయణ, పి.వెంకటరత్నం, హిందీ నికేతన్ విద్యార్థులు పాల్గొన్నారు.